
# ఆరుపదులు
# అన్నమయ్య కృతులు



షష్ట్యబ్దపూర్తి
శాంతిపుష్పము
27-01-2002
ఆదివారం





The H.H. The 45th Jeear of Sri Ahobalmuth

## *My Dad's Parents*



**Sri Kamisetty Venkatasubbaiah and Smt. Lakshmidevamma**

# విన్నపము

మా నాన్నగారి 'షష్ట్యబ్దపూర్తి' సందర్భంగ ఆరుపదులు 'అన్నమయ్య కృతులను' మా కుటుంబానికి సన్నిహితులు, హితులైన రసహృదయులందరికి అందివ్వాలనే ఆశయంతో ఈ చిన్న పొత్తాన్ని సిద్ధం చేసినాము. అన్నమయ్య సంకీర్తనే పానంగ, ప్రాణంగ భావించే మా తండ్రిగారికి, వారి మిత్రులు, శ్రేయోభిలాషులు అయిన సహృదయులకు ఆనందాన్ని, సంతోషాన్ని, తృప్తిని కలిగించేది ఇంతకంటె వేరొకటి లేదు.

25 - 6- 1941 ఆషాఢ శుద్ధ పాడ్యమి ఆర్ద్రనక్షత్రంలో జన్మించిన మా తండ్రిగారు శ్రీమాన్ కామిశెట్టి శ్రీనివాసులు గారు ఈ 'షష్ట్యబ్దపూర్తి' శాంతి వేడుకలు జరపడానికి మాకు అనుమతినివ్వడం వారి వాత్సల్యానికి నిదర్శనం. మాకు జీవితంలో స్థానమానాలు కల్పించిన మా తల్లిదండ్రులకు అలమేలుమంగాశ్రీనివాసుల మంగళాశాసనాలు. సదా మాతాపితరుల మంగళాశాసనాలను కాంక్షించే....

కుమారుడు

డా॥ అనిల్‌కుమార్ కామిశెట్టి

(U.K.)



Dr. ANILKUMAR AND Dr. VIJAYALAKSHMI KAMISETTY

# My ' FATHER ' INLAW

" Your father - in - law is different & difficult " was my father - in - law's self description.

For, me, his description goes beyond just being difficult & different. Personally I have never come across a person so diverse in personality.

He stands out in a crowd - this was my first impression. He is so passionate about his work, if we can name his passion as work, that he is an institution in himself. I am not qualified to write anymore about his professional life.

He as an eldest family member has influenced all our lives in one way or the other. His dedication to his family is no different to his passion towards his work. It is amazing how someone can be so passionate about 2 different aspects of life, family & work.

I consider mysefl to be fortunate to be part of a family with values reinforced in every aspect & also honoured to have had an opportunity to write few lines.

I heartily wish the newly weds, on behalf of my family, on their sacred occasion Lord Venkatachalapathy to bestow his choicest blessings.

"DAUGHTER" IN LAW

**Dr. Vijayalakshmi Kamisetty**

(U.K.)

1.

**ఖాద్రి క్షేత్రంలో వెలసిన స్వయం వ్యక్తమూర్తి ప్రహ్లాదవరదుడు.**

**పల్లవి :**

కదిరి నృసింహుడు - కంబమున వెడలె। విదితముగా - సేవింపరో మునులు

**చరణాలు :**

ఫాలలోచనము - భయదోగ్ర ముఖము। జ్వాలామయ కేసరములును
కాలరౌద్ర సంఘటిత దంతములు। హేలాగతి ధరియించగ నిలిచె

ముడివడు బొమ్మలు - ముంచిన వూర్పులు। గడగడ నదరెటి - కటములను

నిడుద నాలికయు - నిక్కు కర్ణములు। నడియాలపు రూపై వెలసే

సకలాయుధములు - సహస్రభుజములు। వికట నఖంబులు - వెసపూని।
వెకలియగుచు శ్రీ వేంకటేశ్వరుడు। ప్రకటపు దుష్టుల-భంజించె నిదివో

2.

**తాను వలచి వలపించుకొని పరిణయమాడి శ్రీదేవిని తన ఉరాన నిలుపుకొన్నాడు శ్రీనివాసుడు**

**పల్లవి :**

ఈడగు పెండ్లి - ఇద్దరి చేసేము। చేడెలాల ఇది - చెప్పరుగా

**చరణాలు :**

పచ్చిక బయళ్ల-పడతి ఆడగా। ముచ్చట కృష్ణుడు - మోహించీ
వెచ్చపు పూదండ-వేసి వచ్చెనట। గచ్చుల నాతని - కానరుగా

ముత్తెపు ముంగిట- ముదిత నడవగా। ఉత్తముడే చెలి - ఉరమునను
చిత్తరువు వ్రాసి - చెలగివచ్చె, నౌళ। జొత్తుమాని యిటు - చూపరుగా

కొత్త చవికెలో - కొమ్మ నిలిచితే। పొత్తున తలబాలు - పోసెనట
ఇత్తల శ్రీ వేంక-టేశుడు నవ్వుచు। హత్తి సతిగూడె పాడరుగా

## 3.

### పాలకడలి వెడలి వచ్చిన మహాలక్ష్మికి శ్రీనివాసుని పట్టపురాణికి నీరాజనం

**పల్లవి :**

క్షీరాబ్ధి కన్యకకు- శ్రీమహాలక్ష్మికిని । నీరజాలయకును - నీరాజనం

**చరణాలు :**

జలజాక్షి మోమునకు - జక్కవ కుచంబులకు । నెలకొన్న కప్పురపు - నీరాజనం

అలివేణి తురుమునకు - హస్తకమలంబులకు । నిలువు మాణిక్యముల - నీరాజనం

చరణ కిసలయములకు - సకియ రంభోరులకు । నిరతమగు ముత్తేల - నీరాజనం

అరిది జఘనంబునకు - అతివ నిజనాభికిని । నిరతి నానావర్ణ - నీరాజనం

పగటు శ్రీ వేంకటేశు - పట్టపురాణియై । నెగడు సతికళలకును - నీరాజనం

జగతి నలమేల్మంగ - చక్కదనముల కెల్ల । నిగుడు నిజశోభనపు - నీరాజనం

## 4.

### చేతవెన్నముద్ద, నడుమున మణుల ఒడ్డాణం, బాలకృష్ణుని పదలయగతులు జగమంతా నిండినవి.

**పల్లవి :**

భావయామి గోపాలబాలం మన। స్సేవితం తత్పదం - చింతయేయం సదా

**చరణాలు :**

కటిఘటిత మేఖలా - ఖచిత మణిఘంటికా । పటల నినదేన విభ్రాజమానం

కుటిల పదఘటిత సం-కుల శింజిత నతం। చటుల నటనా సముజ్జ్వల విలాసం

నిరత కరకలిత నవ-నీతం బ్రహ్మాది । సురనికర భావనా -శోభితపదం

తిరువేంకటాచలస్థిత మనుపమం హరిం । పరమపురుషం గోపాలబాలం

## 5.

### 'దోబూచి' దొంగాటలలో కూడ వెన్నదొంగ కృష్ణుడే.

**పల్లవి :**

బండి విరిచి పిన్న - పాపలతో నాడి । దుండగీడు వచ్చె- దోబూచి

**చరణాలు :**

పెరుగు వెన్నలు - ప్రియమున-వే । మరు ముచ్చిలించు - మాయకాడు
వెరపున తన- విధము దాచుకొని । దొరదొంగ వచ్చె - దోబూచి

పడుచు గుబ్బెత - పరపుపై పోక । ముడికొంగు నిద్ర - ముంపునను
పడియ తావద్ద - పవళించినట్టి । తొడుకు దొంగ వచ్చె - దోబూచి

గొల్లపల్లెలో యిల్లిల్లా చొచ్చి । కొల్లలాడిన - కోడెకాడు
యెల్లయినా వేంకటేశుడు ఇదె । తొల్లిటి దొంగ వచ్చె - దోబూచి

## 6.

### అంతరంగ బహిరంగాలలో నిలిచిన వేంకటపతి కరుణాంతరంగుడు

**పల్లవి :**

భావములోనా - బాహ్యము నందును । గోవింద గోవింద యని - కొలువవో మనసా

**చరణాలు :**

హరియవతారములే - అఖిల దేవతలు । హరిలోనివే బ్రహ్మాండంబులు
హరినామములే - అన్ని మంత్రములు । హరి హరి హరి- హరి యనవో మనసా
విష్ణుని మహిమలే - విహితకర్మములు । విష్ణుని పొగడెడి - వేదంబులు
విష్ణుడొక్కడే - విశ్వాంతరాత్ముడు । విష్ణువు విష్ణువని - వెదకవో మనసా
అచ్యుతుడితడే - ఆదియు నంత్యము । అచ్యుతుడే - అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీ వేంక-టాద్రి మీద నిదె । అచ్యుత అచ్యుత శరణనవో మనసా

# 7.

## అలమేలుమంగ యెక్కిన పల్లకిని మోసేది ముద్దుగుమ్మలే.

**పల్లవి :**

కులుకక నడవరో - కొమ్మలాలా । జలజల రాలీని - జాజులు మాయమ్మకు

**చరణాలు :**

ఒయ్యనే మేను కదలీ-నొప్పుగా నడవరో । గయ్యాలి శ్రీపాద తాకు-కాంతలాలా

వయ్యెద చెరగు జారీ - భారపుగుబ్బలమీద । అయ్యో చెమరించె మా-యమ్మకు నెన్నుదురు

చల్లెడి గందవొడి మైజారీ నిలువరో । పల్లకి పట్టిన ముద్దు - పణతులాలా

మొల్లమైన కుందనపు - ముత్యాల కుచ్చులదర । గల్లనుచు కంకణాలు-కదలీ మాయమ్మకు

జమళి ముత్యాల తోడి- చమ్మాళిగ లిడరో । రమణికి మణుల నారతు లెత్తరో

అమరించీ కౌగిట -నలమేలుమంగ నిదె । సమకూడె వేంకటేశ్వరుడు మాయమ్మకు

# 8.

## వేంకటపతి అభయహస్తం హరి దశావతారాలను ప్రదర్శించినది.

**పల్లవి :**

ఇందరికి నభయంబు - లిచ్చు చేయి । కందువగు మంచి బంగారు చేయి

**వరణాలు :**

వెలలేని వేదములు- వెదకి తెచ్చిన చేయి । చిలుకు గుబ్బలి కింద-చేర్చు చేయి

కలికియగు భూకాంత-కాగిలించిన చేయి । వలనైన కొనగోళ్ల - వాడిచేయి

తనివోక బలిచేత- దాన మడిగిన చేయి । ఒనరంగ భూదాన- మొసగు చేయి

మొనసి జలనిధి యమ్ము-మొనకు తెచ్చిన చేయి । యెనయ నాగేలు ధరియించు చేయి

పురసతుల మానములు - పొల్ల సేసిన చేయి । తురగంబు పరపెడి - దొడ్డ చేయి

తిరువేంకటాచలధీశుడై మోక్షంబు । తెరువు ప్రాణుల కెల్ల - తెలిపెడి చేయి

## 9.

## శ్రీనివాసుని పెళ్లితిరునాళ్లకు అన్నమయ్య అందించే పసిడి అక్షతలు

**పల్లవి :**

పసిడి అక్షత లివె- పట్టరో వేగమె రారో । దెసల పేరంటాండ్లు-దేవుని పెండ్లికిని

**చరణాలు :**

శ్రీవేంకటేశ్వరునికి - శ్రీమహాలక్ష్మికి । దైవికపు పెండ్లి ముహూర్తము నేడు
కావించి భేరులు మ్రోసె-గరుడధ్వజంబెక్కె । దేవతలు రారో - దేవుని పెండ్లికిని

కందర్పజనకునికి - కమలాదేవికి పెండ్లి । పందిలి లోపల తలంబ్రాలు నేడు
గంధము విడె మిచ్చేరు - కలువడాలు కట్టిరి । అందుక మునులు రారో-హరి పెండ్లికిని

అదె శ్రీవేంకటపతికి-అలమేలు మంగకును । మొదలి తిరునాళ్లకు- మొక్కేము నేడు
ఎదుట నేగేరు వీరె- యిచ్చేరు వరము లివె । కదలి రారో పరుష - ఘనుల పెండ్లికిని

## 10.

## అతడు జ్ఞానయోగి, కర్మయోగి, బ్రహ్మయోగి, అభ్యాసయోగి, అతడే కపిలుడు, దత్తాత్రేయుడు

**పల్లవి :**

తానె తానే యిందరి గురుడు । సాన పట్టిన భోగి - జ్ఞానయోగి

**చరణాలు :**

అపరిమితములైన -యజ్ఞాలు వడి చేయ । ప్రపన్నులకు బుద్ధి - పచరించి
తపముగా ఫలపరి - త్యాగము చేయించు । కపురుల గరిమల - కర్మయోగి

అన్ని చేతలును బ్రహ్మార్పణ విధి చేయ । మన్నించు బుద్ధులను - మరుగ చెప్పి
ఉన్నత పదమున - కొనరగ కరుణించు । పన్నగశయనుడే - బ్రహ్మయోగి

తనరగ కపిలుడై - దత్తాత్రేయుడై । ఘనమైన మహిమ శ్రీవేంకటరాయడై
వొనరగ సంసార-యోగము కృపసేయు । అనిమిషగతుల - అభ్యాసయోగి

## 11.

### మాయాబద్ధుడైన జీవునికి మొదలు లేదు తుదిలేదు

**పల్లవి :**

ఏది తుద దీని-కేది మొదలు । పాదుకొను హరిమాయ-పరగు జీవునికి

**చరణాలు :**

ఎన్ని బాధలు తనకు - ఎన్ని లంపటములు । ఎన్ని వేదనలు మరి-యెన్ని దుఃఖములు
ఎన్ని పరితాపంబు-లెన్ని తలపోతలు । ఎన్ని చూచిన మరియు - ఎన్నైన గలవు

ఎన్ని కొలువులు తనకు - ఎన్ని అనుచరణలు । ఎన్ని ఆసలు మరియు - ఎన్ని మోహములు
ఎన్ని గర్వములు తనకెన్ని దైన్యంబు లివి । యిన్నియును తలప మరి-యెన్నైన గలవు

ఎన్నిటికి చింతించు - ఎన్నిటికి హర్షించు । ఎన్నిటికి ఆశించు - ఎన్నిటికి తిరుగు
ఇన్నియును తిరువేంకటేశు లీలలు కాగ । ఎన్ని చూచినను తా-నెవ్వడును కాడు.

## 12.

### కాత్యాయనీ స్తుతిపాత్రుడు, కైవల్యకామినీ కాంతుడు శ్రీకాంతుడు

**పల్లవి :**

నమో నారాయణాయ నమః । సమధికానందాయ - సర్వేశ్వరాయ

**చరణాలు :**

ధరణీసతి ఘనస్తనశైల పరిరంభ । పరిమళ శ్రమజల ప్రమదాయ
సరసిజనివాసినీ - సరస ప్రణామయుత । చరణాయ తే నమో- సకళాత్మకాయ

సత్యభామా ముఖాంచనపత్రవల్లికా । నిత్యరచనక్రియా - నిపుణాయ
కౌత్యాయనీ స్తోత్ర-కామాయ తేనమో । ప్రత్యక్ష నిజపద-బ్రహ్మరూపాయ

దేవతాధిపమకుట - దివ్యరత్నాంశు సం। భావితామల పాదపంకజాయ
కైవల్యకామినీ - కాంతాయ తే నమో । శ్రీ వేంకటాచల - శ్రీనివాసాయ

# 13.

## అసురులను తరిగి శరణాగతులను కాపాడిన వరదైవము వేంకటాద్రి దొరదైవము

**పల్లవి :**

వాడె వేంకటాద్రి మీద-వరదైవము । పొడిమితో పొడచూపె -పొడవైన దేహము

**చరణాలు :**

ఒక్కొక్క రోమ కూపాన-నొగి బ్రహ్మాండకోట్లు । పిక్కటిల్ల వెలుగొందే - పెనుదైవము
పక్కనను తనలోని- పదునాలుగు లోకాలు । తొక్కి పాదాన కొలిచే- దొడ్డదైవము

వేదశాస్త్రాలు నుతించి-వేసరి కానగలేని । మోదపు పెక్కుగుణాల-మూలదైవము
పోది దేవతల నెల్ల-పుట్టించ రక్షించ। ఆది కారణంబైన- అజు గన్న దైవము

సరుస శంఖచక్రాలు-సరిపట్టి అసురుల । తరిగి పడవేసిన-దండిదైవమా
సిరిపురమున నించి- శ్రీవేంకటేశుడయి । శరణాగతుల గాచె-సతమయిన దైవము

# 14.

## నల్లనివాడు, పద్మనయనమ్ములవాడు మీ గొల్లపల్లెలో లేడుగదమ్మ చెప్పరే

**పల్లవి :**

వలచి వచ్చితి నేను-వానికి గాను । నెలవై మీ గొల్లవాడనే తానుండునంట

**చరణాలు :**

చెందిమ్మి కన్నులవాడు-చేతి పిల్లగ్రోవివాడు । యిందువచ్చె కంటిరా - యేమిరే యమ్మా
మందల పశువులవాడు-మకరాంకములవాడు । యెందు నున్నాడు చెప్పరే-యేల దాచేరమ్మా

నెమలి పించెము వాడు - నీల మేఘకాంతి వాడు। రమణుడాతడు మొక్కే-రమ్మనరమ్మా
జమళి చేతులవాడు సంకుచక్రములవాడు । అమర మీపాల చిక్కెనట చూపరమ్మా

పచ్చపైడి దట్టివాడు-పక్షివాహనపువాడు । యిచ్చినాడు నా కుంగర-మిదివో యమ్మా
చెచ్చెర కోనేటివాడు-శ్రీవేంకటేశ్వరుడు। వచ్చి నన్ను కూడినాడు-వాడు వోయమ్మా

# 15.

**శ్రీరామచంద్రుడు భక్తులపాలిట కామధేనువు, కల్పవృక్షము, పారిజాతము, చింతామణి**

**పల్లవి :**

రామచంద్రుడితడు - రఘువీరుడు । కామితఫలములియ్య- కలిగె నిందరికి

**చరణాలు :**

గౌతముభార్య పాలిటి-కామధేను వితడు । ఘాతల కౌశికు పాలి - కల్పవృక్షము
సీతాదేవి పాలిటి-చింతామణీతడు । యీతడు దాసుల పాలి-యిహపర దైవము

పరగ సుగ్రీవు పాలి - పరమబంధు డితడు । సరి హనుమంతు పాలి-సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి-నిధానము ।గరిమ జనకుపాలి-ఘన పారిజాతము

తలప శబరి పాలి-తత్త్వపురహస్యము । అలరి గుహునిపాలి - అది మూలము
కలడన్నవారి పాలి-కన్ను లెదుటి మూరితి । వెలయ శ్రీవేంకటాద్రి - విభుడితడు

# 16.

**మనసు కోలాట మాడుతున్నది హరిని చేరాలని**

**పల్లవి :**

వెట్టివలపు చల్లకు - విష్ణుమూరితి నాతో । వెట్టదీర మాటాడు- విష్ణుమూరితి

**చరణాలు :**

వినయము సేసేవు - విష్ణుమూరితి నీవు । వెనకటివాడవెకా - విష్ణుమూరితి
వినవయ్య మా మాటలు- విష్ణుమూరితి -మమ్ము । వెనుకొని పట్టకు మీ- విష్ణుమూరితి

వెరవుగల వాడవు-విష్ణుమూరితి, నేడు ।వెరగైతి నిన్ను చూచి - విష్ణుమూరితి
విరివాయ నీ మాయలు - విష్ణుమూరితి, నాకు । విరులిచ్చే వప్పటికే - విష్ణుమూరితి

వెలసె నీ చేతలెల్ల - విష్ణుమూరితి, మా । వెలుపల లోన నీవె - విష్ణుమూరితి
వెలలేని శ్రీ వేంకటే -విష్ణుమూరితి, కూడి ।విలసిల్లితివి నాతో - విష్ణుమూరితి

## 17.

### షోడశకళలతో విలసిల్లే వరలక్ష్మి శ్రీహరి ఉరమెక్కి నిలచినది.

**పల్లవి :**

జయలక్ష్మి వరలక్ష్మి-సంగ్రామ వీరలక్ష్మి । ప్రియురాలవై హరికి - బెరసితివమ్మా

**చరణాలు :**

పాలజలనిధిలోని - పసనైన మీగడ । మేలిమి తామరలోని - మించువాసన
నీలవర్ణు నురము పై - నిండిన నిధానమవై । ఏలేవు లోకములు మమ్మేలవమ్మా

చందురు తోడబుట్టిన - సంపదల మెరగువో । కందువ బ్రహ్మలగాచే -కల్పవల్లివో
అందిన గోవిందునికి - అండనే తోడు నీడవై । వుందానవు మాయింటనే-ఉండవమ్మా

పదియారు వన్నెలతో - బంగారు పతిమ । చెదిరిన వేదముల - చిగురుబోడి
ఎదుట శ్రీవేంకటేశు - ఇల్లాలివైపు నీవు । నిధుల నిలిచే తల్లి- నీ వారవమ్మా

## 18.

అన్నమయ్య తొలిసారిగ వేంకటాచల శిఖరాలను దర్శించి పులకించి గానం చేసినాడు

**పల్లవి :**

అదివో అల్లదివో - హరివాసము । పదివేలు శేషుల - పడగల మయము.

**చరణాలు :**

అదె వేంకటాచల - మఖిలోన్నతము । అదివో బ్రహ్మాదుల - కపురూపము
అదివో నిత్యనివాస - మఖిల మునులకు । అదె చూడుడదె మ్రొక్కు-డానందమయము

చెంగట నల్లదివో - శేషాచలము । నింగినున్న దేవతల - నిజవాసము
ముంగిట నల్లదివో - మూలనున్న ధనము । బంగారు శిఖరాల -బహు బ్రహ్మమయము

కైవల్యపదము వేం-కటనగ మదివో । శ్రీవేంకటపతికి - సిరులైనది
భావింప సకల సం-పదరూప మదివో । పావనముల కెల్ల - పావన మయము

## 19.

**దక్షిణదేశంలో 'తోడైమంగళం' అని ప్రసిద్ధి పొందిన భజన సంప్రదాయంలో చోటుచేసుకున్నదీ కృతి.**

**పల్లవి :**

నారాయణ తే - నమో నమో । నారదసన్నుత - నమో నమో

**చరణాలు :**

మురహర భవహర-ముకుంద మాధవ । గరుడగమన పం-కజనాభ
పరమపురుష భవ - బంధ విమోచన । నరమృగశరీర - నమో నమో

జలధిశయన రవి-చంద్ర విలోచన । జలరుహభవనుత - చరణయుగ
బలిబంధన గో - పవధూ వల్లభ । నలినోదర తే - నమో నమో

ఆదిదేవ సక -లాగమ పూజిత । యాదవకుల మో -హన రూప
వేదోద్ధర శ్రీ - వేంకటనాయక । నాదప్రియ తే - నమో నమో

## 20.

**ఏడుకొండలస్వామి నిత్యసత్యాన్ని చాటే పాట. శ్రీనివాసుని అనుగ్రహానికి పాత్రులైన భక్తుల కథలివి.**

**పల్లవి :**

కొండలలో నెలకొన్న - కోనేటిరాయడు వాడు । కొండలంత వరములు - గుప్పెడు వాడు

**చరణాలు :**

కుమ్మర దాసుడైన - కురువరతినంబి । యిమ్మన్న వరములెల్ల - నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి - తొండమాంజక్కురవర్తి । రమ్మన్న చోటికి వచ్చి - నమ్మినవాడు

అచ్చపు వేడుకతోడ న-నంతాళువారికి । ముచ్చిలి వెట్టికి మన్ను - మోచినవాడు
మచ్చిక దొలక తిరు-మలనంబితోడుత । నిచ్చి నిచ్చ మాటలాడి - నచ్చినవాడు

కంచిలోన నుండ తిరు-కచ్చి నంబిమీద కరు । ణించి తన యెడకు ర-ప్పించినవాడు
యెంచ నెక్కుడైన వేంక-టేశుడు మనలకు । మంచివాడై కరుణపా-లించినవాడు

## 21.

**ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డడు కృష్ణుడు, నవరత్నాలను మరిపించే పదియవ రత్నం**

**పల్లవి :**

ముద్దుగారే యశోద - ముంగిటి ముత్యము వీడు । తిద్దరాని మహిమల - దేవకీ సుతుడు

**చరణాలు :**

అంత నింత గొల్లెతల - అరచేతి మాణికము । పంతమాడే కంసుని - పాలి వజ్రము

కాంతుల మూడు లోకాల -గరుడ పచ్చపూస । చెంతల మాలో నున్న - చిన్ని కృష్ణుడు

రతికేళి రుక్మిణికి - రంగుమోవి పగడము । మితి గోవర్ధనపు గో- మేధికము

సతమై శంఖచక్రాల - సందుల వైడూర్యము । గతియై మమ్ముకాచేటి కమలాక్షుడు

కాళింగుని తలలపై - కప్పిన పుష్యరాగము । యేలేటి శ్రీ వేంకటాద్రి - యింద్రనీలము

పాలజలనిధి లోన-పాయని దివ్యరత్నము । బాలునివలె తిరిగీ - పద్మనాభుఁడు

## 22.

**పరబ్రహ్మం సకల జీవరాశులలో వ్యాపించినది. జాతి-వర్గం-కుల-వర్గం అనే వ్యత్యాసం ఈ భగవత్తత్త్వానికి అంటదు**

**పల్లవి :**

తందనాన ఆహి - తందనాన పురె । తందనాన భళా - తందనాన.

**చరణాలు :**

బ్రహ్మమొకటె పర-బ్రహ్మమొకటె పర । బ్రహ్మ మొకటే పరబ్రహ్మమొకటే

కందువగు హీనాధికము లిందులేవు । అందరికి శ్రీహరే - అంతరాత్మ

ఇందులో జంతుకుల - మింతా నొకటే । అందరికి శ్రీహరే - అంతరాత్మ

నిండార రాజు నిద్రించు - నిద్రయు నొకటే। అండనే బంటునిద్ర- అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు-మెట్టుభూమి యొకటే చండాలుడుండేటి - సరిభూమి యొకటే

అనుగు దేవతలకును - అలకామ సుఖమొకటే ।ఘనకీటపశువులకు - కామసుఖమొకటే
దిన మహోరాత్రములు - తెగి ధనాఢ్యునకొకటే । వొనర నిరుపేదకును-వొక్కటే అవియు

కొరలి శిష్టాన్నములు -కొను ఆకలొకటే। తిరుగు దుష్టాన్నములు - తిను ఆకలొకటే
పరగ దుర్గంధములపై-వాయువొకటే।వరుస పరిమళముపై వాయువొకటే

కడగి యేనుగు మీద - కాయు యెండొకటే । పుడమి శునకము మీద -పొలయునెండొకటే
కడు పుణ్యులను పాప-కర్ములను సరిగావ । జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే.

## 23.

### షోడశోపచారపూజలు దేవదేవునికి సమర్పించడం జీవునికి వేడుక. అదొక విశ్వవిరాట్ స్వరూపం

**పల్లవి :**

షోడశ కళానిధికి - షోడశోపచారములు । జాడతోడ నిచ్చలును - సమర్పయామి

**చరణాలు :**

అలరు విశ్వాత్మకును - కావాహన మిదె, సర్వ । నిలయునకు ఆసనము-నెమ్మినిదె
అల గంగాజనకునకు - అర్ఘ్య పాద్యాచమనాలు । జలధిశాయికి మజ్జనమిదె

వరపీతాంబరునకు-వస్త్రాలంకారమిదే । సరి శ్రీమంతునకు భూషణములివే
ధరణీధరునకు గంధపుష్పధూపములు । తిరమిదే కోటి సూర్య-తేజునకు దీపము

అమృతమథనునకు - అదివో నైవేద్యము ।గమి చంద్రనేత్రునకు-కప్పుర విడెము
అమరిన శ్రీ వేంకటాద్రి మీది దేవునికి । తమితో ప్రదక్షిణాలు - దండములు నివిగో

## 24.

## వసంత కాలంలో వెన్నెలరేల కన్నెలు పాడే చర్చరీగీతాలు

**పల్లవి :**

జగడపు చనవుల జాజర । సగినల మంచపు జాజర

**చరణాలు :**

మొల్లలు తురుముల - ముడిచిన బరువున । మొల్లపు సరసపు - మురిపెమున
జల్లన పుప్పొడి - జారగ పతిపై । చల్లే రతివలు - జాజర

భారపు కుచముల - పైపై కడు సిం । గారము నెరపేటి - గందవొడి
చేరువ పతిపై - చిందగ పడతులు । సారెకు చల్లేరు జాజర

బింకపు కూటమి - పెనగేటి చెమటల । పంకపు పూతల - పరిమళము
వేంకటపతిపై - వెలదులు నించేరు । సంకుమదంబుల జాజర

## 25.

## వేంకటాచల శిఖరాలలో విలసిల్లే ఆధ్యాత్మిక వైభవాలు

**పల్లవి :**

కంటి నఖిలాండ - కర్త నధికుని గంటి । కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి

**చరణాలు :**

మహనీయ ఘన ఫణా-మణుల శైలము గంటి । బహు విభవముల-మంటపములు గంటి
సహజ నవరత్న కాంచనవేదికలు గంటి । రహి వహించిన గోపురంబులవె కంటి

పావనంబైన పాపవినాశనము గంటి । కైవశంబగు గగనగంగ గంటి
దైవికపు పుణ్యతీర్థము లెల్ల పొడగంటి । కోవిదులు కొనియాడు- కోనేరు గంటి

పరమ యోగీంద్రులకు భావగోచరమైన । సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి । తిరు వేంకటాచలాధిపు చూడగంటి

## 26.

### తిరుమల, అహోబలాలలో వర్చస్స్వంతంగ అవతరించిన అలుమేలుమంగ

**పల్లవి :**

గరుడాద్రి వేదాద్రి - కలిమి యీపె । సిరులొసగీ చూడరో - చింతామణి యీపె

**చరణాలు :**

పాలజలధి పుట్టిన - పద్మాలయ యీపె । లాలిత శ్రీనరసింహు -లక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై- మించిన మగువ యీపె । ఈ లీల లోకము లేలే - ఇందిర యీపె

ఘనసంపద లొసగు - కమలాకాంత యీపె । మనసిజు గనిన రమాసతి యీపె
అనిశము పాయని మహా - హరిప్రియ యీపె । ధనధాన్య రూపపు శ్రీ- తరుణి యీపె

రచ్చల వెలసినట్టి - రమావనిత యీపె । మచ్చిక గల అలమేల్మంగ యీపె
ఇచ్చటి శ్రీవేంకటాద్రి నీ అహోబలమునందు । నిచ్చలూ తావుకొనిన నిధానమీపె

## 27.

### అలమేలుమంగ అమనిసొగసులు పొంగిపొరలుతున్నవి

**పల్లవి :**

ఏమని పొగడుదుమే - ఇక నిను । అమని సొబగుల - అలమేల్మంగ

**చరణాలు :**

తెలికన్నుల నీ -తేటలే కదవె । వెలయగ విభునికి - వెన్నెలలు
పులకల మొలకల - పొదులివి గదవె ।పలుమరు పూవుల - పానుపులు
తియ్యని నీ మోవి-తేనెలే గదవే । వియ్యపు రమణుని - విందులివి
ముయ్యక మూసిన - మొలక నవ్వు గదే । నెయ్యపు కప్రపు - నెరిబాగాలు
కైవసమగు నీ-కౌగిలే కదవే । శ్రీ వేంకటేశ్వరు- సిరినగరు
తావుకొన్న మీ - తమకములేకదే । కావించిన మీ- కళ్యాణములు

## 28.

### జీవుని దీనభావమే దేవున కరిగించి కరుణింప చేసేది

**పల్లవి :**

దీనుడ నేను - దేవుడవు నీవు । నీ నిజమహిమే - నెరపుట గాక

**చరణాలు :**

మతి జనన మెరుగ - మరణం బెరుగను । ఇతవుగ నినునిక - నెరిగేనా
క్షితి పుట్టించిన - శ్రీపతివి నీవు । తతినాపై దయ - తలతువు గాక
తలచ పాపమని - తలచ పుణ్యమని । తలపున ఇక నిను - తలచేనా
అలరిన నాలో - అంతర్యామిని । కలుష మెడయ నను - కాతువుగాక
తడవ నా హేయము - తడవ నా మలినము । తడయక నీ మేలు - తడవేనా
విడువలేని శ్రీ- వేంకటవిభుడవు । కడదాకా నిక - కాతువు గాక

## 29.

### అతడు పరమాత్ముడు, విధినిషేధాల కతీతుడు

**పల్లవి :**

విశ్వప్రకాశునకు - వెలియేడ లోనేడ । శాశ్వతున కూహింప - జన్మమిక నేడ

**చరణాలు :**

సర్వపరిపూర్ణునకు - సంచారమిక నేడ । నిర్వాణమూర్తికి - నిలయమిక నేడ
ఉర్వీధరునకు కాలూద - నొక చోటేడ । పార్వతీస్తుత్యునకు - భావమిక నేడ
నానా ప్రభావునకు - నడుమేడ మొదలేడ । అననసహస్రునకు అవ్వలివలేడ
మౌని హృదయస్థునకు - మాటాడ పలుకేడ । జ్ఞానాస్వరూపునకు కానవిననేడ
పరమయోగీంద్రునకు - పరులేడ తానేడ । దురితదూరునకు సంస్తుతి నిందలేడ
తిరువేంకటేశునకు - దివ్య విగ్రహమేడ । హరికి నారాయణున - కవుగాము లేడ

## 30.

**సకలమంత్ర సారము శ్రీవేంకటేశ్వర మంత్రము. 'ఓం నమో వేంకటేశాయ'. ఇది అష్టాక్షరి**

**పల్లవి :**

అన్ని మంత్రములు నిందే - ఆవహించెను । వెన్నతో నాకు కలిగె - వేంకటేశు మంత్రము

**చరణాలు :**

నారదుడు జపియించె - నారాయణ మంత్రము । చేరె ప్రహ్లాదుడు-నారసింహ మంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామమంత్రము । వేరె నాకు కలిగె - వేంకటేశు మంత్రము

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుడు జపించె । అంగలించె కృష్ణమంత్ర మర్జునుడును
ముంగిట విష్ణుమంత్రము-మొగి జనకుడు పఠించె । వింగమై నాకు నబ్బె -వేంకటేశు మంత్రము

ఇన్ని మంత్రముల కెల్ల-యిందిరానాథుడె గురి । పన్నిన దిదియే-పరబ్రహ్మ మంత్రము
నన్ను కావ కలిగెబో - నాకు గురు డియ్యగాను । వెన్నెల వంటిది శ్రీవేంకటేశు మంత్రము

## 31.

**పిండికొద్దీ రొట్టె - మనసుకొద్దీ దేవుడు. ఎట్లా భావిస్తే అట్లా కనిపిస్తాడు వేంకటేశ్వరుడు**

**పల్లవి :**

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి అన్నట్లు

**చరణాలు :**

కొలుతురు మిము వైష్ణవులు - కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు - పరబ్రహ్మం బనుచు
తలతురు మిము శైవులు - తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు - ఆదిభైరవు డనుచు
సరి నెన్నుదురు శాక్తేయులు-శక్తిరూపు నీవనుచు

దరిశనములు మిము నానావిధులను-తలపుల కొలదులు భజింతురు
సిరుల మిమ్మునే అల్పబుద్ధి తలచినవరికి అల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలచిన- ఘనబుద్ధులకు ఘనుడవు

నీవలన కొరతే లేదు మరి-నీరు కొలది తామెరుపు
అసల భాగీరథి దరి బావుల-ఆ జలమే పూరిన యట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము-చేకొని వున్న దైవమని
యీవల నే నీ శరణనియెదను-యిదియే పరతత్త్వము నాకు

## 32.

## శ్రీనివాసుని అభిషేకపు సొగసులు

**పల్లవి :**

ఒకపరి కొకపరి - కొయ్యారమై । మొకమున కళలెల్లా - మొలచినట్లుండె

**చరణాలు :**

జగదేకపతి మేన -చల్లిన కర్పూరధూళి । జిగిగొని నలువంక - చిందగాను
మొగి చంద్రముఖి నురమున నిలిపె గనక । పొగరు వెన్నెల దిగబోసినట్లుండె

పొరి మెరుగు చెక్కుల - పూసిన తట్టుపుణుగు । కరిగి యిరుదెసల - కారగాను
కరిగమన విభుడు గనక మోహమదము । తొరిగి సామజసిరి - తొలకినట్లుండె

మెరయు శ్రీవేంకటేశు మేన సింగారముగాను । తరచయిన సొమ్ములు-ధరియించగా
మెరుగుబోణి అలమేలుమంగయు తాను । మెరపు మేఘము కూడి-మెరసినట్లుండె

# 33.

## అవి రేపల్లె సుద్దులు. వారు పరవశలైన గోపభామినులు

**పల్లవి :**

ఇదివో సుద్దులు - యీ రేపల్లెను । కదిసి యిందరినీ - గైకొనవయ్యా

**చరణాలు :**

పలచని రెప్పల పగటులు నెరపుచు । సొలసి నిన్నొకతె - చూచెనటా
తళుకుల గొల్ల-దండెమీటి యదె । పలికి నిన్నొకతె - పాడెనటా
చనవులు నెరపుచు-సన్న చేయుచును । ననుపున నొక్కతె - నవ్వెనటా
చెనకి ఒకతె యదె - చిగురు గేదగుల । వెనకనుండి నిను -వేసెనటా
అదన నీవు నన్నలమి పట్టగా । కొదలి ఒకతె కని గొణగె నటా
ఎదురనె శ్రీవేంకటేశ ఒకతె నీ । చెదరిన అలకలు - చెరిగెనటా

# 34.

## చింతకాయల జడలు, పొట్టమీద పాలచారలు, కనకపు మువ్వల పాదాలు : పారాడే బాలకృష్ణుడు

**పల్లవి :**

చిన్ని శిశువు చిన్ని శిశువూ । యెన్నడు చూడమమ్మ - యిటువంటి శిశువూ

**చరణాలు :**

తోయంపు కురులతోడ తూగేటి శిరసు, చింత । కాయలవంటి జడలగములతోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ । పాయక యశోదవెంట-పొరాడు శిశువూ

ముద్దుల వ్రేళ్ల తోడ-మొరవంక యుంగరాల । నిద్దపు చేతల పైడి బొద్దులతోడ
అద్దపు చెక్కులతోడ - అప్పలప్ప లనినంత । గద్దించి యశోదమేను - కౌగిలించు శిశువూ

బలుపైన పొట్టమీది - పాలచారల తోడ । నులివేడి వెన్నదిన్న - నోరి తోడ
చెలగి నేడిదె వచ్చి - శ్రీవేంకటాద్రిపై । నిలిచి లోకములెల్ల - నిలిపిన శిశువూ

## 35.

### శ్రీ కృష్ణావతార గాథను వినిపించే సువ్విపాట

**పల్లవి :**

సువ్వి సువ్వి సువ్వాలమ్మా । నవ్వుచు దేవకి నందను గనియె

**చరణాలు :**

శశి వొడచె అలసంబులు గడచె । దిశల దేవతల- దిగుల్లు విడిచె

కావిరి విరిసె - కంసుడు గినిసె । వావిరి పువ్వుల - వానలు కురిసె

గతిసేసె అటు గాడిద కూసె । కుతిల కుడిచి జనకుడు నోరు మూసె

గగురుపొడిచె లోకము విధి విడిచె । మొగులు కురియగ యమునప్పై నడచె

కలిజారె వెంకటపతి మీరె । అలమేల్మంగ నాచా రలుకలు తీరె

## 36.

### గోవులను గోపకులను, గోవర్థన పర్వత మెత్తి, కాపాడిన గోవిందుడు

**పల్లవి :**

గోవిందా శ్రితగోకుల బృందా । పావన జయజయ - పరమానందా

**చరణాలు :**

జగదభిరామా - సహస్రనామా । సుగుణధామ - సంస్తుతనామా

గగనశ్యామా - ఘనరిపుభీమా । అగణిత రఘువంశాబుధి సోమా

జనసుతచరణా - శరణ్యశరణా । దనుజహరణ లలిత స్ఫురణా

అనఘాచరణాయత భూభరణా । దినకర సన్నిభ - దివ్యాభరణా

గరుడ తురంగా-కారోత్తుంగా । శరధిభంగ ఫణిశయనంగా

కరుణాపాంగా కమలాసంగా । వర శ్రీవేంకట గిరిపతి రంగా

## 37.

**విష్ణు కథ, మానవప్రభాత సంధ్యల నుండి, మేధావులందరు ఆలపించినదే**

**పల్లవి :**

వినరో భాగ్యము - విష్ణుకథ । వెనుబల మిదివో - విష్ణుకథ

**చరణాలు :**

ఆదినుండి సంధ్యాది విధులలో । వేదంబయినది - విష్ణుకథ
నాదించీ నిదె - నారదాదులచే । వీధి వీధులనే - విష్ణుకథ

వదలక వేదవ్యాసులు నుడిగిన । విదిత పావనము- విష్ణుకథ
సనదంబైనది - సంకీర్తనయై । వెదకిన చోటనే - విష్ణుకథ

గొల్లెతలు చల్ల గొనకొని - చిలుకగ । వెల్ల విరియాయ - విష్ణుకథ
యిల్దిదె శ్రీ వేంకటేశ్వరు నామము । వెల్లిగొలిపె నీ విష్ణుకథ

## 38.

**అలమేలుమంగా శ్రీనివాసులు కల్యాణ మహోత్సవం**
**నను సిగ్గుతెరలలో వధువు : కోడె సింగారాలు ఒలకబోసే వరుడు**

**పల్లవి :**

పిడికిటి తలంబ్రాల - పెండ్లి కూతురు కొంత ! పెడమరలి నవ్వీని - పెండ్లి కూతురు

**చరణాలు :**

పేరుగల జవరాలే - పెండ్లికూతురు పెద్ద ! పేరుల ముత్యాలమెడ - పెండ్లికూతురు,
పేరంటాండ్ల నడిమి - పెండ్లికూతురు, విభు ! పేరుకుచ్చ సిగ్గువడీ - పెండ్లికూతురు

బిరుదు పెండెము వెట్టె - పెండ్లికూతురు, నెర ! బిరుదుమగని కంటె - పెండ్లికూతురు
పిరిదూరి నప్పుడే - పెండ్లికూతురు, పతి ! పెరరేచీ నిదివో - పెండ్లికూతురు

పెట్టనే పెద్దతురుము - పెండ్లికూతురు, నేడె ! పెట్టెడు చీరలు కట్టీ - పెండ్లికూతురు
గట్టిగ వేంకటపతి-కౌగిట, వడి ! వెట్టిన నిధానమైన - పెండ్లికూతురు

## 39.

### యదుకుల తిలకుడు, గోపికల గొబ్బిళ్ళపాటలలో, అవి జీవనాయికల కరతాళధ్వనులు

**పల్లవి :**

కొలనిదోపరికి-గొబ్బిళ్లో, యదు ! కుల స్వామికి - గొబ్బిళ్లో

**చరణాలు :**

కొండ గొడుగుగా-గోవుల గాచిన ! కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యుల కెల్లను, తల ! గుండు గండనికి - గొబ్బిళ్లో

పాప విధుల శిశుపాలుని తిట్టుల ! కోపగానికిని గొబ్బిళ్లో
ఏపున కంసుని-యిడుమల బెట్టిన ! గోపబాలునికి-గొబ్బిళ్లో

దండివైరులను-తరిమిన దనుజుల ! గుండె దిగులునకు-గొబ్బిళ్లో
వెండి పైడియగు-వెంకటగిరిపై ! కొండలయ్యకును-గొబ్బిళ్లో

## 40

### చక్కదనాలకే చక్కదనం మహాలక్ష్మి. భగవంతుని ప్రశంసలకంటె భాగవతుని ఆశంసనలు గొప్పవి

**పల్లవి :**

చక్కని తల్లికి-ఛాంగుభళా, తన ! చక్కెర మోవికి చాంగుభళా

**చరణాలు :**

కులికెడి మురిపెపు-కుమ్మరింపు తన ! సళువు చూపులకు-చాంగుభళా
పలుకుల సొలపుల-పతితో కసరెడి ! చలముల అలుకకు-చాంగుభళా

కిన్నెరతో పతి-కెలన నిలుచు, తన ! చన్ను మెరుగులకు-చాంగుభళా
ఉన్నతి పతిపై-ఒరిగి నిలుచు, తన! సన్నపు నడిమికి-చాంగుభళా

జందెపు ముత్యపు-సరుల హారముల ! చందనగంధికి - చాంగుభళా
విందయు వేంకట-విభు పెనచిన, తన ! సంది దండలకు- చాంగుభళా

## 41

**పరమపద మనుగ్రహించే వైభవమూర్తి తిరువేంకటపతి**

**పల్లవి :**

అన్ని విభవముల - అతడితడు ! కన్నులు వేవేలు కల ఘనుడితడు

**చరణాలు :**

వేదాంతకోట్ల-విభు డితడు ! నాద బ్రహ్మపు-నడు మితడు
ఆది నంత్యములకు-అరుదితడు ! శ్రీదేవుడు సరసిజనాభు డితడు

భవము లణచు యదుపతి యితడు ! భువనము లన్నిటికి పొడవితడు
దివికి దివమైన-తిర మితడు ! పవనసుతు నేలినపతి యితడు

గరుడని మీదటి-ఘను డితడు ! సిరు లిందరికి నిచ్చే-చెలు వితడు
తిరు వేంకటనగము-దేవు డితడు ! పరమపదమునకు-ప్రభు డితడు

## 42

**మనసుకు అద్దంపట్టి చూపేది ముఖం, ఆమె శరీరభంగిమలు ఆమె భావరతికి సంకేతాలు.**

**పల్లవి :**

సకలం హేసఖి జానామి తత్ ! ప్రకట విలాసం-పరమం ధధసే

**చరణాలు :**

అలిక మృగమదమయ మషీకలనోజ్జ్వలతాం హేసఖి జానామి
లలితం తవ పల్లవిత మనసి ని ! శ్చలతర మేఘశ్యామం ధధసే

చారు కపోలస్థల కరాంచిత వి ! చారం హేసఖి జానామి
నారాయణ మహినాయక శయనం ! శ్రీరమణం తవ చిత్తే ధధసే

ఘన కుచశైలా గ్రస్థిత విధుమణి ! జననం హేసఖి జానామి
కన దురసా వేంకటగిరిపతే ! ర్వినుత భోగసుఖ విభవం ధధసే

**అతడు కాలమేఘము, పారిజాతము, కామధేనువు, చింతామణి, సిద్ధమంత్రము అన్నమయ్య నమ్మిన కులదైవం. అతడు తిరుమల శ్రీనివాసుడు**

**పల్లవి :**

పొడగంటిమయ్య మిమ్ము-పురుషోత్తమా మమ్ము ! నెడయకవయ్య-కోనేటిరాయడా

**చరణాలు :**

కోరి మమ్ము ఏలినట్టి-కులదైవమా, చాల ! నేరిచి పెద్ద లిచ్చిన-నిధానమా
గారవించి దప్పి తీర్పు-కాలమేఘమా, మాకు ! చేరువ చిత్తములోని-శ్రీనివాసుడా

భావింప కైవసమైన-పారిజాతమా, మమ్ము ! చేవదర కాచినట్టి-చింతామణీ
కావించి కోరికలలిచ్చే-కామధేనువా, మమ్ము ! తావై రక్షించేటి-ధరణీధరా

చెడనీక బ్రతికించే-సిద్ధమంత్రమా, రోగా ! లడచి రక్షించే దివ్యౌషధమా
బడిబాయక తిరిగే-ప్రాణబంధుడా, మమ్ము ! గడియించినట్టి శ్రీవేంకటనాథుడా.

44

**అలమేలుమంగ దివ్యనృత్యపు పాట ఇది అన్నముని భావలయ**

**పల్లవి :**

అలరులు కురియగ-నాడె నదే ! అలకల కులుకుల-అలమేలుమంగ

**చరణాలు :**

అరవిరి సొబగుల-అతివలు మెచ్చగ ! అరతెర మరుగున-ఆడె నదే
వరుసగ పూర్వదు-నాళవు తిరుపుల ! హరి కరగింపుచు-అ లమేలుమంగ

మట్టపు మలపుల-మట్టెల కెలపుల ! తట్టెడి నడిపుల-దాటె నదే
పెట్టిన వజ్రపు - పెండెపు తళుకులు ! అట్టిటు చిమ్ముచు-నలమేలుమంగ

చిందుల పాటల-శిరిపొలయాటల ! అందెల మ్రోతల-నాడె నదే
కందువ తిరువేం-కటపతి మెచ్చగ ! అందపు తిరువుల-అలమేలుమంగ

## 45

### కష్టమైన సుఖమైన, జన్మ జన్మలకు నేను కోరేది నీ సేవే

**పల్లవి :**

ఎండగాని నీడగాని-యేమైనా కాని ! కొండలరాయుడే మా-కులదైవము

**చరణాలు :**

తేలుగాని పాముగాని-దేవపట్టయినగాని ! గాలిగాని ధూళిగాని-కాని యేమైనా
కాలకూట విషమైన-గ్రక్కున మ్రింగిన నాటి ! నీలవర్ణుడే-నిజదైవము

చీమగాని దోమగాని-చెలది యేమైనగాని ! గాముగాని నాముగాని-కాని యేమైనా
పాముల నిన్నిటి మ్రింగే-బలు తేజపు నెక్కు ! ధూమకేతువే మా-దొరదైవము

పిల్లిగాని నల్లిగాని-పిన్న యెలుకైన గాని ! కల్లగాని పొల్లగాని-కాని యేమైనా
బల్లిదుడై వేంకటాద్రి-పై నున్న యాతడె, మ ! మ్మెల్ల కాలమును ఏలే-యింటి దైవము

## 46

### వేంకటేశ్వరుని మీది భక్తి శాంతి సౌఖ్యాలను ప్రసాదిస్తుంది

**పల్లవి :**

సకల శాంతికరము-సర్వేశ నీపై భక్తి ! ప్రకటమై మీకు నబ్బె-బదికించు నిదియె

**చరణాలు :**

మనసులో పాపబుద్ధి-మరి యెంత తలచినా ! నిను తలచినంతనే-నీరౌను
కనుగొన్న పాపములు-కడలేని వైనాను ! ఘనుడ నిన్ను చూచితే-కడకు తలగును

చేతనంటి పాతకాలు-సేనగా నే చేసినాను ! అతల నీకు మొక్కితే-అన్నియు పాయు
ఘాతల చెవుల వినగా నంటిన పాపపు ! నీతితో నీకథ వింటే-నిముషాన పాయును

కాయమున చేసేటి-కర్మపు పాపములెల్ల ! కాయపు నీ ముద్రలచే-గక్కన వీడు
యేయెడ శ్రీవేంకటేశ-యేయే పాతకమైనా ! అయమైన నీ శరణాగతిచే నణగు.

## 47

**పాట ఉయ్యాలలా, ఉయ్యాల పాటలా సాగుతున్నది. ఆరోహణ అవరోహణ క్రమాలు తెలిపే రేపల్లె పాట**

**పల్లవి :**

ఉయ్యాలా బాలు-నూచెదరు కడు ! నొయ్య నొయ్య-నొయ్యనుచు

**చరణాలు :**

బాలయవ్వనలు - పసిడి వుయ్యాల ! బాలుని వద్ద పాడేరు
లాలి లాలి లాలి లాల్మ ! లాలి లాలి లాలి లాలనుచు

తమ్మిరేకు కనుదమ్ముల నవ్వుల ! పమ్మి చూపుల పాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల ! ధిమ్మి ధిమ్మి ధిమ్మి-ధిమ్మనుచు

చల్లు చూపుల - జవరాండ్లు రే ! పల్లె బాలుని పాడేరు
బల్లిదు వేంకటపతి చేరందెలు ! ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లనుచు

## 48

**తల్లి బిడ్డకు ఉగ్గుపెట్టే వైనం కళ్లకు కట్టినట్లు చూపించినాడు అన్నమయ్య.**

**పల్లవి :**

ఉగ్గు పెట్టరే - వోయమ్మా చెయ్యొగ్గీ నిదె శిశు - వోయమ్మా

**చరణాలు :**

కడుపులోని లోకమ్ములు కదలీ 1 నొడలూచకురే - వోయమ్మా
తొడికెడి సరుగన - తొలగ తీయరే ! వుడికెడి పాలివి-వోయమ్మా

చప్పలు వట్టుక - సన్నపు బాలుని ! ఉప్పర మెత్తకురో యమ్మా
అప్పుడె సకలము - నదిమీ నోరనె ! నొప్పదు తియ్యరె - వోయమ్మా

తొయ్యలు లిటు చేతుల నలగించక ! వుయ్యాల నిడరే -వోయమ్మా
కొయ్యమాటలను-కొండల తిమ్మని ! ఒయ్యన తిట్టకురోరమ్మా.

## 49

### తాను ధరించిన మాలను పరమాత్ముని కర్పించి పరిణయమాడిన గోద, తిరుప్పావై పరిమళాలను అందించిన పూబోడి

**పల్లవి :**

చూడరమ్మ సతులాల-సోబాన పాడరమ్మ ! కూడున్నది పతి-చూడికుడుతనాచారి

**చరణాలు :**

శ్రీమహాలక్ష్మియట-సింగారాల కేమరుదు ! కాముని తల్లియట చక్కదనాల కేమరుదు
సోముని తోబుట్టువట - సొంపు కళకే మరుదు ! కోమలాంగి యీ చూడికుడుతనాచారి

కలాశాబ్ధి కూతురట-గంభీరాల కేమరుదు ! తలప లోకమాతయట-దయ మరి యే మరుదు
జలజ నివాసి యట చల్లదన మేమరుదు ! కొలదిమీర యీ చూడికుడుతనాచారి

అమరవందిత యట-అట్టి మహి మేమరుదు ! అమృతము చుట్టమట-ఆనందాల కేమరుదు
తమితో శ్రీవేంకటేశు తానె వచ్చి పెండ్లాడె ! కొమెరవయసు చూడికుడుతనాచారి.

## 50

### పద్మసరోవరంలో ఉద్భవించిన అలర్‌మేల్‌మంగ, అమ్మగారి పాటలో అయ్యగారి అవతారాలు

**పల్లవి :**

అమ్మమ్మ యేమమ్మ-అలమేల్మంగ నాచారమ్మా ! తమ్మియింట అలరుకొమ్మా వోయమ్మా

**చరణాలు :**

నీరిలోనా తల్లడించి-నీకే తలవంచీ ! నీరికిందా పులకించీ-నీరమణుండు
గోరికొన చెమరించీ-కోపమే పచరించీ ! సారెకు నీ అలుకిట్టే చాలించవమ్మా

నీకు గానే చెయిచాచి-నిండా కోపము రేచీ ! మేకొని నీ విరహాన-మేను పెంచీనీ
ఈకడాకడి సతుల-హృదయమే పెరరేచి ! ఆకుమడిచియ్యనైనా - ఆనతియ్యవమ్మా

చక్కదనములే పెంచీ-సకలము కాలదంచీ ! నిక్కపు వేంకటేశుడు-నీకే పొంచీని
మక్కువతో అలమేల్మంగ నాచారమ్మా నీ ! అక్కున అతని నిట్టె-అలరించవమ్మా

## 51

### అహోబల నరసింహుడు అవతరించినది వేదాద్రిలోనే

**పల్లవి :**

వేదములే నీ నివాసమట-విమల. నారసింహా ! నాదప్రియ సకలలోకపతి-నమో నరసింహా

**చరణాలు :**

ఘోరపాతక నిర్హ రణా-కుటిలదైత్యదమనా ! నారాయణ రమాధినాయక-నగధర నరసింహా

నీరూపం బింతయంత యని-నిజము తెలియరాదు ! యారీతి త్రివిక్రమాకృతి-నేచితి నరసింహా

గోవిందా గుణగణరహితా-కోటిసూర్యతేజా! శ్రీ వల్లభా పురాణపురుషా - శితనఖ నరసింహా

దేవ మిము ప్రహ్లాదులకును-తెలియ నలవికాదు ! భావించగ ప్రహ్లాదు నెదుట-పరగితి నరసింహా

దాసపరికర సులభ-తపనచంద్ర నేత్రా ! వాసవ సురముఖ మునిసేవిత-వందిత నరసింహా

భాసురముగ శ్రీవేంకటగిరి-పాయనిదైవము వటుగాన! వోసరి కొపుడేగతినిట్ల నహోబల నరసింహా.

## 52

### ఆంజనేయుడు మంగాంబుధిలో అవతరించినా ఆకృతి పొందినది వేంకటపతి సన్నిధిలోనే

**పల్లవి :**

మంగాంబుధి హనుమంతా నీ శరణ ! మంగవించితిమి హనుమంతా

**చరణాలు :**

బాలార్కబింబము - ఫలమని పట్టిన ! ఆలరిచేతల-హనుమంతా

తూలని బ్రహ్మాదులచే వరములు ! వోలి చేకొనిన - వో హనుమంతా

జలధి దాట నీ సత్వము కపులకు ! అలరి తెలిపితివి-హనుమంతా

ఇలయు నాకసము - నేకముగా నటు !బలిమి పెరిగితివి- భళి హనుమంతా

పాతాళము లోపలి మైరావణు ! నాతల చంపిన-హనుమంతా

చేతులు మోడ్చుక - శ్రీ వేంకటపతి ! నీతల కొలిచే-హిత హనుమంతా.

## 53

## తల్లి శయనశృంగారాలను తనయుడు తడబాటులేక వర్ణించినాడు.

**పల్లవి :**

పలుకుతేనల తల్లి-పవళించెను ! కలికితనముల విభుని - కలసినది గాన.

**చరణాలు :**

నిగనిగని మోము పై - నెరులు కెలకుల చెదర ! పగలైన దాక చెలి-పవళించెను
తెగని పరిణతులతో - తెల్లవారినదాక ! జగదేకవతి మనసు - జట్టిగొనెగాన

కొంగుజారిన మెరుగు - గుబ్బలొలయగ తరుణీ ! బంగారు మేడపై - పవళించెను
చెంగలువ కనుగొనల - సింగారములు తొలక ! అంగజగురునితోడ-అలసీనదిగాన

మురిపెంపు నటనతో - ముత్యాల మలగుపై ! పరవశంబున తరుణీ - పవళించెను
తిరువేంకటాచలా -ధిపుని కౌగిటకలసి ! అరవిరై నునుజెమట - నంటినదిగాన.

## 54

## దేవుని పడకటిల్లు వెడలివచ్చిన దేవేరి అమలిన సింగారాలు

**పల్లవి :**

ఏమొకొ చిగురుటధరమున-యెడనెడ కస్తురి నిండెను! భామిని విభునకు వ్రాసిన-పత్రికకాదు గదా

**చరణాలు :**

కలికి చకోరాక్షికి కడ-కన్నులు కెంపై తోచిన ! చెలువం బిప్పుడిదేమో-చింతింపరె చెలులు
నలువున ప్రాణేశ్వరు పై-నాటిన యాకొన చూపులు !నిలువున పెరుకగ అంటిన-నెత్తురు కాదు గదా.

పడతికి చనుగవ మెరుగులు-పైపై పయ్యెద వెలుపల! కడు మించిన విధమేమో-కనుగొనరే చెలులు
ఉడుగని వేడుకతో - ప్రియుడొత్తిన నఖశశిరేఖలు ! వెడలగ వేసవికాలపు-వెన్నెలకాదుగదా

ముద్దియ చెక్కుల కెలకుల-ముత్యపు జల్లుల చేర్పుల! వొద్దికలాగు లివేమో-వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి-కామిని వదనాంబుజమున! అద్దిన సురతపు చెమటల-అందము కాదు గదా.

## 55

### బాలకృష్ణని 'దొంగచేష్టలు ' ముగ్ధసుందరంగ తెలిపేపాట

**పల్లవి :**

ఇట్టి ముద్దులాడి బాలు-డేడవాడు వాని ! పట్టి తెచ్చి పొట్టనిండ-పాలు వోయరే

**చరణాలు :**

గామిడై పారితెంచి-కాగెడి వెన్నలలోన ! చేమపూవు కడియాల-చేయి పెట్టి
చీమ కుట్టెనని తన - చెక్కిట కన్నీరు జార ! వేమరు వాపోయే వాని-వెడ్డు వెట్టరే.

ముచ్చువలె వచ్చి తన-ముంగ మురువుల చేయి ! తచ్చెడి పెరుగులోన-దగబెట్టి
నొచ్చెనని చేయి తీసి-నోర నెల్ల జొల్లుగార ! వొచ్చెలి వాపోవువాని-నూరడించరే.

ఎప్పుడు వచ్చెనో మా-యిల్లు చొచ్చి పెట్టెలోని ! చెప్పరాని వుంగరాల-చేయిపెట్టి
అప్పుడైన వేంకటాద్రి-అసవాలకుడుగాన ! తప్పకుండ పట్టి వాని తలకెత్తరే.

## 56

### తన గురుతు తెలియనీక మన గురుతులను బట్టబయలు చేసే దొరదొంగ

**పల్లవి :**

గురుతెరిగిన దొంగ-కూగూగు వీడె ! గుడిలోనె దాగేని-కూగూగు

**చరణాలు :**

నెలతల దోచీని-నీల్లాడగానె ! కొలని దరిని దొంగ కూగూగు
బలువైన వుట్లు-పాలారగించీని ! కొలది మీరిని దొంగ-కూగుగు

చల్లలమ్మంగ-చనుకట్టు దొడికీని ! గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిల్లు తప్పక-యిందరి పాలిండ్లు ! కొల్లలాడిన దొంగ-కూగూగు

తావుకొన్న దొంగ-తగిలి పట్టుండిదె ! గోవులలో దొంగ-కూగూగు
శ్రీవేంకటగిరి చెలువుండో యేమొ ! కోవిదుడు దొంగ-కూగూగు.

# 57

## అలమేలుమంగా శ్రీనివాసులకు జయమంగళం, శుభమంగళం

### పల్లవి :

మరలి మరలి జయ మంగళము ! సొరిది నిచ్చలును - శుభమంగళము

### చరణాలు :

కమలారమణికి - కమలాక్షునకును ! మమతల జయజయ - మంగళము
అమరజననికి - అమరవంద్యునకు ! సుముహూర్తముతో - శుభమంగళము

జలధికన్యకును-జలధిశాయికిని ! మలయుచును శుభ-మంగళము !
కలిమికాంతకా-కలికి-విభునికిని - సుళువుల యారతి-శుభమంగళము

చిత్తజుతల్లికి-శ్రీ వేంకటపతికి ! మత్తిల్లిన జయ-మంగళము !
ఇత్తలనత్తల-ఇరువురకౌగిటి ! జొత్తుల రతులకు-శుభ మంగళము

# 58

## పరబ్రహ్మతత్వాన్ని చాటే శ్రీనివాసుని దివ్యపాదము

### పల్లవి :

బ్రహ్మ కడిగిన - పాదము ! బ్రహ్మము తానెనీ - పాదము

### చరణాలు :

చెలగి వసుధ కొలిచిన దీపాదము ! బలితల మోసిన - పాదము
తలకక గగనము-తన్నిన పాదము ! బలరిపు గాచిన- పాదము

కామిని పాపము-కడిగిన పాదము పాముతల నిడిన-పాదము
ప్రేమవు శ్రీసతి-పిసికెడి పాదము ! పామిడి తురగవు-పాదము

పరమయోగులకు -పరిపరి విధముల ! వర మొసగెడి నీ-పాదము
తిరువేంకటగిరి-తిరమని చూపిన ! పరమపదము నీ-పాదము.

## 59

**జననమరణాల మధ్య సాగేదంతా నాటకము, వేంకటేశుడు జగన్నాటక సూత్రధారి**

**పల్లవి :**

నానాటి బదుకు-నాటకము ! కానక కన్నది-కైవల్యము

**చరణాలు :**

పుట్టుటయు నిజము-పోవుటయు నిజము ! నట్టనడిమి పని-నాటకము
యెట్ట నెదుటగల-దీప్రపంచము ! కట్టకడపటిది-కైవల్యము

కుడిచే దన్నము-కోకచుట్టెడిది ! నడుమంత్రపు పని-నాటకము
వొడిగట్టుకొనిన వుభయకర్మములు ! గడి దాటినపుడె కైవల్యము

తెగదు పాపము తీరదు పుణ్యము ! నగీనగీకాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరు డేలిక ! గగనము మీదిది కైవల్యము.

## 60

**తిరుపతి వేంకటరమణునికి శరణు శరణు**

**పల్లవి :**

శరణు శరణు సురేంద్ర సన్నుత-శరణు శ్రీసతి వల్లభా
శరణు రాక్షస గర్వసంహర-శరణు వేంకటనాయకా

**చరణాలు :**

కమలధరుడును కమలమిత్రుడు-కమలశత్రుడు పుత్రుడు
క్రమముతో మీ కొలువు కిప్పుడు-కాచినా రెచ్చరికయా

అనిమిషేంద్రులు మునులు దిక్పతు-లమర కిన్నర సిద్ధులు
ఘనతతో రంభాదికాంతలు-కాచినా రెచ్చరికయా

ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు-నిన్ను కొలువగ వచ్చిరీ
విన్నపము వినవయ్య తిరుపతి-వేంకటాచలనాయకా.

# షష్టిపూర్తి సంస్కృతి

-డాక్టర్ వింజమూరి విశ్వనాథమయ్య

సంఖ్యామానంలో షష్టి అంటే అరవై. మానవ జీవితంలో 'షష్టిపూర్తి' అంటే వయస్సు అరవై సంవత్సరాలు నిండడం. 'షష్ట్యబ్ద (షష్టి+అబ్ద) పూర్తి' అనే పదం ఈ అర్థాన్నే వివరిస్తోంది. ప్రతిమానవుని జీవితగమనంలో ఈ అరవైయవ సంవత్సరం ఒక పెద్ద మలుపు; ఒక గొప్ప గెలుపు. తర్వాతి జీవితానికి ఒక మేలుకొలుపు.

షష్టిమ సంవత్సరం అంత ముఖ్యమైందని అతి ప్రాచీన కాలంలో వేద ఋషులే గుర్తించారు. వారిదృష్టిలో ఇది ఒక పునర్జన్మ. మానవుడు జన్మించినప్పుడు జననకాల శాంతి ఎలా చేసుకోవాలో, ఇప్పుడు కూడ అలాగే షష్టిపూర్తి శాంతి చేసుకోవాలని వారు నిర్ణయించారు. కనుక ఇది వైదిక సంస్కృతి, అర్ష సంప్రదాయం. ఈ మార్గంలో మనం నాటి నుండి నేటివరకు అనూచానంగా భక్తిశ్రద్ధలతో నడుస్తూ, యథాశక్తిగా ఆచరిస్తూ ముందుకు సాగుతున్నాం.

ఆధునిక కాలంలో జరుగుతున్న షష్టిపూర్తి కార్యక్రమాలలో రెండు ప్రధానమైన అంశాలు. కనిపిస్తున్నాయి.

ఒకటి : శాంతి కార్యక్రమం, రెండు : క్రాంతి కార్యక్రమం.

మొదటిది శాస్త్రబద్ధం, రెండవది సంప్రదాయ సిద్ధం.

---

★ శ్రీ నోరి నరసింహశాస్త్రి గారి వ్యాసం 'షష్టిపూర్తి మహోత్సవములు' (ఆంధ్రపత్రిక - ఉగాది సంచిక - 1951) ఆధారంగా.

# 1. శాంతి కార్యక్రమం

అరవైయవ సంవత్సరంలో చేసే శాంతి కార్యక్రమానికి 'ఉగ్రరథశాంతి' అని పేరు. 'ఉగ్రరథుడు' అంటే 'తీవ్రస్వభావం కలిగిన కాలస్వరూపుడు' అని అర్థం. 'శతమానం భవతి' అన్నట్లు వంద సంవత్సరాల మానవ జీవితంలో పూర్వార్ధమంతా పెరిగేకాలం. ఉత్తరార్ధమంతా పండేకాలం. ఈ ఉత్తరార్ధ జీవితం ప్రశాంతంగా పరిపూర్ణం కావాలనే సత్సంకల్పంతో చేసే దైవిక కార్యక్రమమే 'ఉగ్రరథ శాంతి'.

ఈ శాంతి కార్యక్రమం చేయటానికి మూడు విధానాలు ఉన్నాయి. అవి (1) శౌనకోక్తం (2) బోధాయనోక్తం (3) శైవాగమోక్తం. ఈ మూడింటిలోని ప్రక్రియ, మూలసూత్రాలు ఒక్కటే ! తంత్రం నడపడంలో మాత్రమే కొన్ని భేదాలు ఉన్నాయి. వీటిలో శైవాగమోక్తశాంతి చాలా విస్తృతమైంది. దాన్ని ఉన్నదున్నట్లు ఆచరించగలవారు ఏ మహారాజులో, చక్రవర్తులో మాత్రమే ! అట్లని సామాన్య గృహస్థులు ఆచరించటానికి ఇది వీలుకానిదని అనుకోకూడదు. భగవంతుడు మానవులనుంచి కోరేది మానసికమైన భక్తినే గాని, భౌతికమైన ధనాన్ని కాదు గదా ! 'పత్రం, పుష్పం' ఫలం, తోయం' అన్నట్లు మానవులందరు యథాశక్తిగా ఈ 'శాంతి'ని చేసుకోవచ్చు.

'జన్మతః షష్టమేవర్షే' - అనే శౌనకోక్తిని బట్టి, జన్మాదిగా అరవైయవ సంవత్సరంలో ఈ 'శాంతి' ని చేసుకోవాలి. అందులోనే ఈ క్రింది వాక్యాలు కూడ కనిపిస్తున్నాయి.

''జన్మాబ్దే జన్మమాసేచ, స్వజన్మదివసే తథా !

జన్మర్షేచైవ కర్తవ్యా, శాంతి రుగ్రరథాహ్వయా !!

దేవాలయే నదీతీరే, స్వగృహేవా శుభస్థలే ....''

జన్మించిన సంవత్సరం , అదే నెల, అదేరోజు, అదే నక్షత్రంలో ఈ శాంతి చేసుకోవాలి. భారతీయ సంస్కృతిలో ప్రభవ, విభవ మొదలైన సంవత్సరాలు అరవై ఉన్నాయి. ఈ అరవై సంవత్సరాలు గడచి, తిరిగి మనం పుట్టిన సంవత్సరం, అదే నెల, అదే రోజు, అదే నక్షత్రం వస్తే సరిగ్గా అక్కడికి షష్టిపూర్తి అవుతుంది. ఆరోజు శాంతి

చేసుకోగలిగితే అది అత్యుత్తమ మన్నమాట ! ఏ కారణం చేతనైనా అలా వీలుకాని పక్షంలో అరవైయవ సంవత్సరంలో ఆ సంవత్సరం పూర్తి అయ్యే లోపల శాంతి చేసుకోవాలి.

ఈ కార్యక్రమం నిర్వహించటానికి ఒక శుభస్థలం కావాలి. అది దేవాలయమైనా కావచ్చు, నదీతీరమైనా కావచ్చు, లేక తాను నివసిస్తున్న ఇల్లైనా కావచ్చు. ఏదైనా పవిత్రమైన స్థలాన్ని ఎన్నుకోవాలి.

ఇది కార్యక్రమంలో ప్రధానంగా మృత్యుంజయదేవతా కలశస్థాపన, ప్రతిమాస్థాపన, అర్చన చేయాలి. అట్లే దుర్గను, గణపతిని, విష్ణువును పూజించాలి. ఇదంతా పరాత్పర పూజ!

సముద్రాలను, నదులను, దిక్పాలకులను, నవగ్రహాలను, చిరంజీవులను కలశాలలోనికి ఆవాహనం చేసి, ఆయాదేవతల సువర్ణప్రతిమలను స్థాపించి పూజించాలి. ఇదంతా ప్రకృతి రూప పరమాత్మ యొక్క ఆరాధనం.

ఇట్లే అరవై మంది సంవత్సర దేవతలు, ఇద్దరు అయన (ఉత్తరాయణ, దక్షిణాయన) దేవతలు, ఆరు ఋతువులు, పన్నెండు నెలలు, రెండు పక్షాలు, తిథులు, వారాలు, నక్షత్రాలు, యోగాలు, కరణాలు, రాసులు -వీటి అధిష్ఠానదేవతలను పూజించాలి. ఇదంతా కాలస్వరూపుడైన పరమాత్మ యొక్క ఆరాధన.

ఇంకా మనకు సుదూరంగా ఉన్న ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, దశదిశలు, అష్టవసువులు, సప్తవాయువులు, పంచబ్రహ్మలు - వీరందరినీ అర్చించాలి. ఇదంతా సర్వప్రపంచరూపుడైన పరమాత్మ యొక్క ఆరాధన.

ఈ దేవతలందరికీ కలశారాధనం, ప్రతిమాపూజనం, జపతపాలు, వేరువేరుగా చేసి చివరకు హోమం చేయాలి. అప్పుడు ఆచార్యులు, ఋత్విక్కులు ఆయుసూక్తాది మంత్రోచ్చారణలతో బాటు ఆ కలశోదకాలతో యజమానిని అభిషేకించి, ఆశీర్వదించాలి.

ఇక్కడ యజమాని ఒక సామాజిక బాధ్యతను నిర్వర్తించాలి. కోటాను కోట్ల జీవరాసులతో నిండిన ఈ సృష్టిలో తాను కూడా ఒక చిన్న జీవి, విభిన్న మానసిక

సంస్కారాలు కలిగిన ఈ ప్రాణికోటి (సమాజం) అంతా, తాను (యజమాని) అరవై సంవత్సరాలపాటు ఎదగడానికి ఎంతో సహకరించింది. అందుకు కృతజ్ఞతగా - జ్ఞానులైన పెద్దలకూ, సామాన్య మానవాళికి అందరికీ తృప్తి కలిగేటట్లు యథాశక్తిగా దానధర్మాలు చేయాలి.

ఈ శాంతియజ్ఞం నిర్వహించిన ఆచార్యులకు, ఋత్విక్కులకు ప్రతిమాదిక దానాలు, దశదానాలు, నవగ్రహ ప్రీతికరంగా నవధాన్యదానాలు, గోదానము మొదలైనవి చేయాలి. చివరిది - అన్ని దానాలలో మొదటిది - అన్నదానం. ఆచార్యులు, ఋత్విక్కులు, బంధు మిత్రాదులతో బాటు - దీనులు, అనాథులు అయిన సామాన్య జనులందరికీ తృప్తిగా అన్నదానం చేయాలి.

ఈ విధమైన ఆధ్యాత్మిక - భౌతిక శాంతి కార్యక్రమాలతో యజమాని దైవికమైన - సామాజికమైన ఋణం నుండి విముక్తుడై సుఖశాంతులతో, ఆయురారోగ్యభాగ్యాలతో, పుత్రపౌత్రాదులతో వర్ధిల్లుతాడు.

## 2. క్రాంతి కార్యక్రమం

శాస్త్రీయమైన 'శాంతి' కార్యక్రమం తరువాత సాంప్రదాయికంగా జరుపుకొనే వేడుక 'కల్యాణం' దీన్ని 'క్రాంతి' కార్యక్రమం అనవచ్చు. 'క్రాంతి' అంటే క్రమణం, అడుగు ముందుకు వేయడం. అంటే మరో క్రొత్త జీవితాన్ని ప్రారంభించడ మన్న మాట!

షష్టిపూర్తి ఇటు గృహస్థ జీవితానికి భరతవాక్యం, అటు వానప్రస్థ జీవితానికి నాందీ వాక్యం అనవచ్చు. వానప్రస్థంలో భార్యాభర్తలిద్దరూ కలిసే జీవిస్తూ, జీవిత లక్ష్యాన్ని సాధించవలసి ఉంటుంది. వానప్రస్థ ధర్మాలలో ముఖ్యమైంది బ్రహ్మచర్యం,అప్పుడు వారు బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, ఒక వినూత్నమైన దాంపత్య జీవితం సాగించాలన్న మాట! ఈ రహస్యాన్ని జ్ఞాపకం చేయడం కోసం జరిపే కార్యక్రమమే 'కల్యాణం'. యౌవనంలో జరిపే కల్యాణం భార్యాభర్తలను భౌతికంగా ఏకం చేస్తే, షష్టిపూర్తి కల్యాణం వారిని మానసికంగా ఏకం చేస్తుంది. వారు ఆది దంపతుల లాంటి వృద్ధ దంపతులై, ఇక ఆధ్యాత్మికంగా కలిసి ముందడుగు వేస్తారు. అందువల్లే ఈ కల్యాణమే వారి భవిష్యత్ జీవితానికి క్రాంతి కార్యక్రమం.

వానప్రస్థ ధర్మాలను మహాభారతం ఈ క్రింది విధంగా పేర్కొన్నది..

'వనవాస ' వన్యభోజనం' బ్రహ్మచర్య, జటాజిన

ప్రధారణములు వానప్రస్థ ధర్మకోటి'

(అనుశాసనిక పర్వం - 5.12)

వనం (ప్రకృతి) లో నివసించడం, ప్రకృతిలో సహజంగా లభించే ఫలాదులను ఆహారంగా స్వీకరించడం, జటా వల్కలాలు ధరించడం, బ్రహ్మచర్యం - ఇవి వానప్రస్థుల ప్రధాన ధర్మాలు.

ఈ సమయంలో పాటించవలసిన వ్రతాలు కూడ కొన్ని ఉన్నాయి. అవి - ఉపవాసాలు, మౌనం, భూమిపై శయనించడం, ధ్యానం, నియమిత ఆహారనిష్ఠ మొదలైనవి. ఈ అన్నిటిని కలిపి 'తపస్సు' అంటారు. ఈ దృష్టితో వీరు తాపసులు అవుతున్నారు. వీరు సాధించబోయే లక్ష్యాన్ని భారతం ఇలా వివరించింది.

'దారయుతంబుగా నడచు

తాపస ముఖ్యులు అహింస పేర్మికై

కారుణికత్వ మగ్గలము

కల్గి, తలంతురు సర్వజీవులున్

తారును ఒక్కరూపుగ,

పదంపడి పుత్రకళత్రయక్తి పెం

పారుదురు ఊర్ధ్వలోకమున '

(అను ..... 5-20)

దార అంటే భార్య. ఈ తాపసులు భార్యతో కలిసి జీవిస్తూనే సాధన చేస్తారట. 'సహధర్మచారిణి' అనే పదం ఆమెకు వాన ప్రస్థాశ్రమంలో కూడ ఈ విధంగా వర్తిస్తుందని తెలుస్తోంది. ఆ తపస్వి దంపతులు ఎవ్వరినీ బాధించకుండా జీవిస్తూ,

అహింసను ఇంచుమించు పరిపూర్ణంగా సాధించడానికి ప్రయత్నిస్తారు. సమస్త ప్రాణులూ, తామూ ఒక్కటే అని భావిస్తూ, వారు పరమదయాళువులై జీవితాన్ని పండించుకుంటారు.

దీనికి ఫలితంగా ఆ వ్యక్తి భార్యాపుత్రులతో కలసి ఊర్ధ్వలోకాలను పొంది, స్వర్గ సౌఖ్యాదులను అనుభవిస్తాడు. ఇదీ కల్యాణవేడుక రూపంగా జరిగే క్రాంతి కార్యక్రమంలోని పరమార్థం!

★

ఈ విధంగా శాంతి - క్రాంతి కార్యక్రమాలతో సాగే షష్ట్యబ్దపూర్తి, ఆధ్యాత్మిక - సామాజిక స్ఫూర్తితో భారతీయ సంస్కృతికి సర్వసమగ్రమైన ప్రతిబింబంగా భాసిస్తోంది.

★


## *My Dad's Brothers and Sisters*



Dr. Lalita, Kamala, Maheswari, Hemalata, Sugandhi, Nagaratnam, Lakshminarasimhulu, Jwalanarasimhulu, Srinivasulu, Vijayakumar, Dhananjaya & Lakshmiprasad



Dr. Anilkumar, Srinivas, Ankita, Chandrasekhar, Srin
Dr. Vijayalakshmi, Vaijayanthi, Rukmini, Pujita, Srinivasulu, Godalakshmi, H



SRI LAKSHMI NRISIMHA SWAMY OF AHOBILAM

## మాతృదేవో భవ. పితృదేవో భవ



షష్ట్యబ్దపూర్తి దంపతులు

శ్రీమతి రుక్మిణి, శ్రీమాన్ కామిశెట్టి శ్రీనివాసులు